క్లుప్తంగా

వసతి గృహానికి నగదు వితరణ



సంస్థకు నగదు అందజేస్తున్న దాత రామచంద్రరావు

వేటపాలెం: స్థానిక గొల్లపూడి వారి వీధిలో గల జీవీకేసీ ఎయిమ్ ఫర్ సేవా బాలుర వసతి గృహానికి విశ్రాంత రైల్వే ఉద్యోగి దుగ్గి రామచంద్రరావు రూ.10,116 వేలు సోమవారం బహూకరించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టభద్రుల సంఘం అధ్యక్షులు ప్రత్తి వెంకట సుబ్బారావు మాట్లాడుతూ దుగ్గి రామచంద్రరావు ఉద్యోగ విరమణ చేసిన అనంతరం ప్రజలకు సేవ చేయడానికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నున్నా శివప్రసాదరావు, దోగపర్తి గుణశేఖర్, కరణం మురళీ, వెంకటేశ్వర్లు, మస్తాన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక స్వాతంత్ర్యంతోనే మహిళల అభివృద్ధి



మార్టూరు: గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా స్వయం ప్రతిపత్తి సాధించినప్పుడే వారి కుటుంబాలతో పాటు సమాజంలో గౌరవించబడతారని ఎఫర్ట్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ జేవీ మోహన్‌రావు అన్నారు. స్థానిక అమ్మ ఆశ్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ మార్టూరు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించిన ఉచిత మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మహిళలను ఉద్దేశించి మాట్లాడారు. 45 రోజుల శిక్షణ అనంతరం మహిళలకు సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు షేక్ హబీబున్ తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు గుంటుపల్లి చందు రావి అంకమ్మ చౌదరి, ఖాజా హుస్సేన్, రావుల బాపయ్య స్థానిక మహిళలు పాల్గొన్నారు.



వైద్యులకు రక్షణ లేకుండా పోయింది..
ఆసుపత్రుల్లో ప్రాణాలు రక్షించే మహిళా వైద్యులకే రక్షణ లేకుండా పోయింది. ముఖ్యంగా మహిళా ఆరోగ్య సిబ్బంది పనిచేసే చోట తప్పనిసరిగా వారికి రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో సమాజంలో మహిళలకు రక్షణ కరువైంది. ఇంకా వైద్యశాలల్లో మహిళా వైద్యులకు, మహిళా వైద్య సిబ్బందికి, మహిళా రోగులకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి.
– కే. సారమ్మ, ఏఎన్ఎం, చినగంజాం పీహెచ్‌సీ



పోలీసు రక్షణ తప్పనిసరి చేయాలి..
మహిళా ఉద్యోగులు పనిచేసే ప్రతి చోట పోలీసు రక్షణ ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా రాత్రి వేళ పనిచేసే ప్రాంతంలో రక్షణ ఏర్పాటు చేయాలి. ఆసుపత్రుల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిత్యం నిఘా ఉంచాలి. ఆ కెమెరాలను పోలీసు స్టేషన్‌కు అనుసంధానించాలి. ముఖ్యంగా మారుమూల గ్రామీణ ప్రాంతాల్లోని వైద్యశాలల్లో నిఘా అవసరం మరింతగా ఉంది.
– పీ షకీనా, ఎంఎల్‌హెచ్‌పీ, కొత్తపాలెం

లోకాల పాలుడు గోపాలుడు..



పర్చూరులో ఉట్టి కొడుతున్న బాలుడు



ఇంకొల్లు: ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న చిన్నారులు

- వేడుకగా కృష్ణాష్టమి వేడుకలు
- ఉత్సాహంగా ఉట్టికొట్టిన యువత

చీరాల టౌన్/వేటపాలెం: వెన్నదొంగ, చిన్ని దొంగ అల్లరి.. అల్లరి ముద్దుల దొంగ అయినా చిన్నారి శ్రీకృష్ణుడి కృష్ణాష్టమి వేడుకలను సోమవారం ప్రతి ఇంటా జరుపుకున్నారు. చీరాల రూరల్ గ్రామాల్లోని దేవాలయాలోల శ్రీకృష్ణుడికి పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఉట్టికొట్టే వేడుకలను చేశారు. చేతిలో పిల్లనగ్రోవితో చిన్నపిల్లలను ప్రత్యేకంగా కృష్ణుడి వేషధారణలో అలంకరించారు. వేటపాలెం మండల పరిధిలోని ఆణుమల్లిపేటలో గల రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో కృష్ణ మందిరంలో గీతాపారయణం చేశారు.

శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారుల సందడి..

కారంచేడు/చినగంజాం: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల సందర్భంగా కారంచేడు చెరువు కట్ట మీద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో శ్రీకృష్ణ సేవా సమితి అధ్వర్యంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కట్ట మీద, పుట్టాయిపాలెం వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో యువకులు హాజరయ్యారు.

■ ఇంకొల్లులో వరలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శాంతినికేతన్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకుడు ఆవులమంద సుబ్బయ్య వారి కుమారులు రామకృష్ణ, కిరణ్‌కుమార్‌లు కార్యక్రమాన్ని నిర్వహించారు.

■ పర్చూరులో స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో బాలబాలికలకు ఉట్టికొట్టడం, భరత నాట్యం, విచిత్ర వేషధారణ తదితర రంగాలలో పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రావువారి వెంకట శివప్రసాద్ తెలిపారు.



కృష్ణుడి అలంకరణలో ఓ చిన్నారి



కారంచేడులో వేషధారణలో చిన్నారులు



అలవలపాడులో నిర్వహిస్తున్న కృష్ణాష్టమి వేడుకలు

అద్దంకి/జే.పంగులూరు: నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి ఘనంగా నిర్వహించారు. అద్దంకి మండలం ధర్మవరం గ్రామంలో యాదవుల ఆధ్వర్యంలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. అద్దంకి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో హరిహర గోశాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు అందరిని ఆకర్షించారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ వీవీ ఆదినారాయణ, సెక్రటరీ అయితా రాజా, చిన్ని మురళీకృష్ణ, వనిత క్లబ్ ప్రెసిడెంట్ వి. విజయలక్ష్మీ, సెక్రటరీ ఎస్ అంజలి గోశాల యాజమాన్యం సుబ్బారావు పాల్గొన్నారు.

■ జే. పంగులూరు మండల పరిధిలోని అలవలపాడు యాదవ యూత్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

అపుస్మా జిల్లా కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గం



ఎన్నికైన అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు

చీరాల: ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ (అపుస్మా) అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నిక కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. జిల్లా కార్యవర్గం ఎన్నికకు జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ యాజమాన్యాల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికలో జిల్లా గౌరవాధ్యక్షుడిగా టి.విజయభాస్కర్ (ఇంకొల్లు), జిల్లా అధ్యక్షుడిగా ఎం.వెంకటేశ్వర్లు (చీరాల), జిల్లా ఉపాధ్యక్షుడిగా ఓ.అంజిరెడ్డి (అద్దంకి), జనరల్ సెక్రటరీగా ఎస్.రవి శంకర్ (రేపల్లె), జాయింట్ సెక్రటరీగా జి.బ్రహ్మం (అద్దంకి), కోశాధికారిగా వి.నాగేశ్వరరావు (భట్టిప్రోలు), ఈసీ సభ్యులుగా హయగ్రీవాచారి (రేపల్లె), యు.రామకృష్ణ (ఈపూరుపాలెం, చీరాల)లు ఎన్నికయ్యారు. ప్రైవేటు అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ బలోపేతానికి కృషి చేస్తానని జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ఎన్నికల అధికారులకు, కరస్పాండెంట్లకు ధన్యవాదాలు తెలిపారు.

అపుస్మా పర్చూరు అధ్యక్షుడిగా రాము

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) పర్చూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా తేళ్ల వెంకట రాము ఎన్నికయ్యారు. సోమవారం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏవీ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నియోజకవర్గ నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా కృష్ణంశెట్టి రామకోటేశ్వరరావు, కార్యదర్శిగా చిలుకూరి శ్రీధరరావు, కోశాధికారిగా కాట్రగడ్డ శ్రీనివాసరావు, సభ్యులుగా గడ్డం ఆంజనేయులు, నాదేండ్ల లక్ష్మయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధ్యక్షులు తెలియజేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు



క్షతగాత్రుడిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

మేదరమెట్ల: కారు అదుపుతప్పి డివైడర్ కోసం ఉంచిన సిమెంట్ దిమ్మెను ఢీకొన్న ఘటన కొరిశపాడు మండలం పీ.గుడిపాడు జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. ఇద్దరు రోగులు తిరుపతి నుంచి గుంటూరు వైద్యశాలకు కారులో వెళ్తున్నారు. కారు అత్యవసర ల్యాండింగ్ వద్దకు రాగానే రోడ్డు మధ్యలో ఉంచిన సిమెంటు దిమ్మెను కారు అదుపు తప్పి ఢీకొట్టింది. ఈప్రమాదంలో కారులోని ఒకరికి స్వల్ప గాయాలు కాగా ప్రథమ చికిత్స అనంతరం హైవే అంబులెన్స్‌లో గుంటూరు తరలించినట్లు హైవే పోలీసులు తెలిపారు.

టోల్ ప్లాజా సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలి

మార్టూరు: టోల్ ప్లాజా సిబ్బందిని అక్రమంగా తొలగించిన మేనేజర్‌పై చర్యలు తీసుకొని, తొలగించిన సిబ్బందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. రైతు సంఘం, సీఐటీయూ నాయకులతో కలిసి బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన వేతనాల పెంపుదల కోసం ప్రయత్నిస్తే సిబ్బందిని తొలగించడం, ఇతర రాష్ట్రాలకు బదిలీలు చేసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.



ధర్నాలో పాల్గొన్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

జూదరుల అరెస్టు

వేటపాలెం: కఠారివారిపాలెం శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎం వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వీరి వద్ద నుంచి రూ. 11,100 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు. జూదాలు ఆడినా, నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పార్టీని బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలి



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్



బాలాజీని మర్యాద పూర్వకంగా కలిసిన కరణం వెంకటేష్, తదితరులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: ఎన్నికలలో ఓడిపోయామని ఎవరూ అధైర్యపడవద్దు.. మనకు 52 వేల మంది ఓట్లు వేశారు. వారందరికి మనం అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ముందుగా పిట్టువారిపాలేనికి చెందిన పిట్టు పోలయ్యను అక్రమ కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తుండడంతో ఆయన పోలయ్యను పరామర్శించారు. నియోజకవర్గ నాయకులతో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన మోసపూరిత హామీలతో మళ్లీ అధికారంలోకి రాలేరని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. తనకు మూడోసారి కాలుకు ఆపరేషన్ జరిగిందని, మరికొద్ది రోజుల్లో నియోజకవర్గంపై దృష్టి సారిస్తామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులకు కలిగిస్తే సహించేది లేదన్నారు. చైర్మన్, కౌన్సిలర్లు కలిసి ఉండాలని సూచించారు. ఏదైనా సమస్యలు ఉంటే తనకు తెలియచేస్తే వెంటనే స్పందిస్తానన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు డాక్టర్ జి.సుబ్బారావు, శ్రీనివాసరెడ్డి, సాంబిరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షులు బొడ్డు సుబ్బారావు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, నాయకులు మల్లెల రాజశేఖర్, తేళ్ల రాంబాబు, వాసిమళ్ల వాసు, గుంటూరు మాధవరావు, రామన్నపేట సర్పంచ్ పాల్గొన్నారు.

సహకరించుకుందాం.. పార్టీని బలోపేతం చేద్దాం

ఒకరికొకరు సహకరించుకుంటూ పార్టీని బలోపేతం చేద్దామని చీరాల, పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జులు కరణం వెంకటేష్, యడం బాలాజీలు అన్నారు. సోమవారం పర్చూరు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యడం బాలాజీని ఆయన చీరాలలోని ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో పక్కపక్కనే ఉన్న చీరాల, పర్చూరు నియోజకవర్గాలలో పార్టీని మరింతగా బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, మున్సిపల్ కౌన్సిలర్లు ఉన్నారు.

వరికి సాగర్ నీరందిస్తామని ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతూ రైతు సంఘం నాయకులు

జే.పంగులూరు: నాగార్జున సాగర్ ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో ఆరుతడి పంటను సాగు చేసుకోమని ప్రభుత్వం చెప్పడం సరి కాదని.. నిర్ణయం మార్చుకొని వరి సాగుకు నీరు ఇస్తామని ప్రభుత్వం వెంటనే ప్రకటన చేయాలని రైతు సంఘం బాపట్ల జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులన్ని పూర్తి నిండిపోయి నీరంతా సముద్రం పాలవుతుండగా ప్రభుత్వం ఇలాంటి ప్రకటన చేయటం సరైనది కాదని రైతు సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, జిల్లా నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరావు విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్టు, నాగార్జున ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తిగా నిండిపోయాయని చెప్పారు. సాగు తాగునీటికి ఈఏడాది ఎలాంటి ఇబ్బంది లేదని ఉండబోదని రైతాంగం భావిస్తున్న తరుణంలో ఈప్రకటన రైతాంగాన్ని నిరాశకు గురిచేసిందని తెలిపారు.

హైదరాబాద్‌కు రెండు సర్వీసులు ప్రారంభం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీఎం

అద్దంకి రూరల్: అద్దంకి డిపో నుంచి హైదరాబాద్‌కు రెండు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు అద్దంకి డిపో డీఎం రామ్మోహనరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రావినూతల, పమిడిపాడు, చందలూరు, పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదుగా హైదరాబాద్ బీహెచ్‌సీఎల్‌కు ఒక సర్వీసు నడపబతుండగా కృష్ణాష్టమి సందర్భంగా పమిడిపాడు నుంచి రావినూతల, దైవాలరావూరు, మేదరమెట్ల, అద్దంకి మీదుగా హైదరాబాద్‌కు ఒకటి, చందలూరు, పంగులూరు, ముప్పవరం, అద్దంకి మీదుగా హైదరాబాద్ బీహెచ్‌సీఎల్ మరొకటి మొత్తం రెండు బస్సులు నడపబడుతున్నట్లు డీఎం తెలిపారు. ఈసౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించు కోవాలని కోరారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



దొంగలు పగులగొట్టిన బీరువా

అద్దంకి రూరల్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగిన ఘటన ఆదివారం అర్ధరాత్రి జరగ్గా సోమవారం మధ్యాహ్నం వెలుగులోకి వచ్చింది. ఎస్సై ప్రవీణ వివరాల మేరకు.. అద్దంకి పట్టణం శ్రీనగర్‌లో 3వ లైన్‌లో నివాసం ఉంటున్న తోట నాగేశ్వరరావు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసి శ్రీశైలం వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తాళం పగులగొట్టి అందులోని బట్టలు చిందర వందరగా పడవేసి అందులో ఉన్న 10 గ్రాముల బంగారం, కొన్ని వెండి వస్తువులు, రూ. 3 వేలు నగదు అపహరించారు. సోమవారం మధ్యాహ్నం చుట్టుపక్కల వారు గమనించి విషయం నాగేశ్వరరావుకు తెలియజేశారు. సాయంత్రానికి వచ్చిచూడగా దొంగతనం జరిగిందని గ్రహించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు.

సోలార్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

మేదరమెట్ల: ఇంటికి సంబంధించి సోలార్ కనెక్షన్ కావాల్సిన వారు ఆన్‌లైన్‌లో కాని విద్యుత్ సిబ్బంది ద్వారా కానీ దరఖాస్తులు చేసుకోవాలని డీఈఈ సత్యనారాయణ తెలిపారు. కొరిశపాడు మండలం రావినూతల గ్రామంలో సోమవారం సోలార్‌కు సంబంధించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సెంటర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా గృహాలకు సోలార్‌ను సబ్సిడీపై అందజేస్తారన్నారు. మండలంలో రావినూతల గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేశామని, గ్రామంలో నూరుశాతం సోలార్ కనక్షన్‌లు పొందితే పంచాయతీకి కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ. 1 కోటి అందజేస్తామని ఏఈఈ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు